## రూ.1.30 లక్షలు పట్టివేత

దండేపల్లి, ఏప్రిల్2 : మండలంలోని గూడెం చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ భూమేశ్, ఎస్ఎస్‌టీం ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. గూడెం చెక్‌పోస్ట్ వద్ద రాయపట్నం నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరి వద్ద రూ.1,30,500 స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఎస్‌టీం ఇన్‌చార్జి విజయ్‌ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



గూడెం చెక్‌పోస్ట్ వద్ద నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ

## ఎకో బ్రిడ్జిని పరిశీలించిన ఏటీఆర్ ఎఫ్‌డీపీటీ క్షితిజ

రెబ్బెన, ఏప్రిల్ 28 : తక్కలపల్లి సమీపంలోని ఎకో‌బ్రిడ్జి(అండర్‌పాస్), తక్కలపల్లి ధర్మారం ప్లాంటేషన్‌లను అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఎఫ్‌డీపీటీ క్షితిజ ఆదివారం పరిశీలించారు. కవ్వాల్ టైగర్ రిజర్వు ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, రెబ్బెన రేంజ్ ఇన్‌చార్జి అధికారి శ్రీధరాచారి ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎకో‌బ్రిడ్జి నిర్మాణం, ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సతీశ్, బీట్ అధికారులు భూక్య రవి, మమత ఉన్నారు.



తక్కలపల్లి దగ్గర లోని ఎకో బ్రిడ్జి వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఏటీఆర్ ఎఫ్‌డీపీటీ క్షితిజ

# కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి

- మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- బీజేపీకి ఓటేస్తే రాజ్యాంగాన్ని మారుస్తది
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- మంచిర్యాలలోని పలు కాలనీల్లో ప్రచారం

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 28 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాలలోని హమాలీవాడ, వసంత టాకీస్ ఏరియా, ఓవర్‌బ్రిడ్జి ఏరియా, అశోక్‌రోడ్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. హామీల గురించి అడిగితే ఇష్టంవచ్చినట్లు తిడుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురవుతున్నారో ఆలోచించుకోవాలన్నారు. కేసీఆర్ పాలన ఏ రకంగా ఉందో, రేవంత్‌రెడ్డి పాలన ఏ రకంగా ఉందో ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆరు గ్యారంటీల పథకాలేవీ అమలు కావని, వారికి బుద్ధి చెబితేనే హామీలు అమలు చేస్తారన్నారు. బీజేపీ ఏం చేసిందని ఓటు వేయాలని ప్రశ్నించారు. బీజేపీని నమ్మి ఓటువేస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, అప్పుడు మనం ప్రశ్నిస్తే జైళ్లలో పెడుతారని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి ఆనాడు కేసీఆర్ నాయకత్వంలో చేసిందేనని గుర్తుకు చేశారు. ఒకసారి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల గురించి ఆలోచించాలని, వారితో కొప్పుల ఈశ్వర్‌ను పోల్చుకుంటే ఎంతో తేడా ఉందని, ఈ ప్రాంత వ్యక్తిగా, ఇక్కడి సమస్యలు తెలిసిన వ్యక్తిగా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తిగా, కార్మిక నాయకుడిగా పేరున్న కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేసి గెలిపించుకుంటే మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అంకం నరేశ్, గాదెసత్యం, నాయకులు పడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

### కార్మికులు అండగా ఉండాలి

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 28 : పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు సింగరేణి కార్మికవర్గమంతా అండగా నిలిచి గెలిపించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. ఆదివారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గోదావరికాలనీలో కార్మిక వాడల్లో స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. గోదావరికాలనీ ప్రధాన చౌరస్తాలో వ్యాపారులను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం కార్మికవాడల్లో ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ సర్కారులో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదని, ఆ పార్టీకి ఓటెయ్యవద్దన్నారు. ఒక సామాన్య సింగరేణి కార్మికుడిగా.. మీలో ఒకడిగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు గరిసె రామస్వామి, కౌన్సిలర్ వంగ తిరుపతి, కుర్మిళ్ల అన్నపూర్ణ, బేర సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ పానుగంటి సత్తయ్య, మాజీ సర్పంచ్‌లు మల్లెత్తుల రాజేంద్రపాణి, గుంట జగ్గయ్య, వార్డు అధ్యక్షులు రవిగౌడ్, రఫీక్ ఖాన్, తోట దుర్గాప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బండి రమేశ్, పెట్టం లక్ష్మణ్, పొగాకు రమేశ్, నాయకులు జనార్దన్, శెట్టి రమణ, బండారి తిరుపతి, రుకుం తిరుమల్, పెరుక సత్తయ్య, జాడి భానుచందర్, పెద్దపల్లి వెంకటేశ్, రామన్న, కందుల ప్రశాంత్, మండల క్రాంతి, ఆకుల రమేశ్, తిప్పని రాయలింగు, కుర్మిళ్ల మోహన్, చిట్టంపల్లి నరేశ్ పాల్గొన్నారు.



దండేపల్లిలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

# బూటకపు హామీలను నమ్మొద్దు

- ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి
- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- దండేపల్లి మండల కేంద్రంలో ప్రచార సభ

దండేపల్లి, ఏప్రిల్28 : కాంగ్రెస్, బీజేపీల బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని పెద్దపెల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి దండేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అవకాశమివ్వాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని పెద్దపెల్లి పార్లమెంట్ స్థానాన్ని దక్కించుకోవాలన్నారు. 3 నెలల కాంగ్రెస్ పాలనలో ఎన్నో కష్టాలను చూస్తున్నామని, మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదన్నారు. కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన అవసరముందన్నారు. గులాబీ సైనికులను ఇబ్బంది పెట్టడం పక్కన పెట్టి పాలనపై శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. ఎక్కడ ఏ చిన్న కష్టమొచ్చినా మీ ముందుంటానని, కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అక్కల రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ భూమన్న, యూత్ ప్రధాన కార్యదర్శి అల్లంల సంతోష్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

### గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కార్యకర్తలు, నాయకులను కోరారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గార్డెన్స్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేస్తే కలిగే నష్టాన్ని వివరించాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన కుకుడ గ్రామస్తులతో ఎమ్మెల్సీ దండె విఠల్

## బీఆర్ఎస్‌నే గెలిపించాలి

- ఈ పదేళ్లలో బీజేపీ చేసిందేమీ లేదు
- ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూర్, ఏప్రిల్ 28 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఆదివారం మండలంలోని మర్తిడి, లుంబీనీనగర్, తుమ్మలగూడ, కుకుడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుకుడలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలన చేసి చేసిందేమీ లేదని, మరోసారి గెలిస్తే రిజర్వేషన్‌లు తొలగించడంతో పాటు రాజ్యాంగాన్ని మార్చేస్తుందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి రైతులు, సామాన్య ప్రజల కష్టాలు పట్టవని చెప్పుకొచ్చారు. రాష్ట్రం లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని, ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కుకుడ కు చెందిన 30 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్సీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జడ్పీటీసీ పంద్రం పుష్పలత, మాజీ సర్పంచ్ మేర్గు తిరుపతి, నాయకులు సోమం చిన్నయ్య, సామల రాజన్న, ఖాజా సమీయొద్దీన్, లచ్చయ్య, రమేశ్, మహేశ్, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆత్రం సక్కును గెలిపించండి

కౌటాల మండలంలో బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం

కౌటాల, ఏప్రిల్ 28 : ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలంటూ కౌటాల మండలంలో పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క శంకర్ కార్యకర్తలతో కలిసి పల్లెల్లో పర్యటిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ఆదివారం బోదంపల్లి, యాపలగూడ, నాగెపల్లి, గురుడుపేట, గుడ్లబోరి, వైగాం, పీపీనగర్, కన్నెపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు దుర్గం వెంకటేశ్, చారి గోవింద్ రావు, మంగేశ్, కత్తెరసాల శంకర్, కామ్రె శంకర్ ఉన్నారు.



బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్ర సక్కు గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## రెబ్బెనలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం


రెబ్బెన, ఏప్రిల్ 28 : రెబ్బెనలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి ఆదివారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్ గౌడ్, ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, కో ఆప్షన్‌మెంబర్ జౌరొద్దీన్, బీఆర్ఎస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ, మహిళా మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, మాజీ సర్పంచ్‌లు బొమ్మినేని అహల్యాదేవి, బుర్స పోశమల్లు, ఒరగంటి మల్లేశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి వినోద్‌జైస్వాల్, నాయకులు వోల్వోజి వెంకటేశంచారి, పల్లె రాజేశ్వర్‌రావు, కడతల మల్లయ్య, జుమ్మిడి ఆనందరావు, అజయ్‌జైస్వాల్, బొమ్మినేని శ్రీధర్, మన్యం పద్మ, అన్నపూర్ణ మురళీగౌడ్, మదాసు రవీందర్, పందిర్ల మధునయ్య, ఇంగు మల్లేశ్, తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న పోటు శ్రీధర్‌రెడ్డి

# ఏనుగు వస్తే ఏం చేద్దాం..!

- ముందస్తు వ్యూహం రచిస్తున్న అధికారులు
- ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ అప్రమత్తం
- పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు



మహారాష్ట్ర నుంచి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోకి వచ్చిన ఏనుగు (ఫైల్)



ఏనుగుల మంద వస్తే ఏం చేయాలో అవగాహన కల్పిస్తున్న రేంజ్ అధికారి రవి

కోటపల్లి, ఏప్రిల్ 28 : ఇటీవల మహారాష్ట్ర నుంచి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చిన ఓ ఏనుగు ఇద్దరిని పొట్టనబెట్టుకున్న విషయం విదితమే. ప్రస్తుతం అది తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో సంచరిస్తుండగా, మళ్లీ మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తే ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై అధికారులు ముందస్తు వ్యూహం రచిస్తున్నారు. తెలంగాణ పోలీసులు, అధికారులు మహారాష్ట్ర అటవీ అధికారులను సమన్వయపర్చుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఏనుగు సంచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉంటున్నారు. ఏనుగు ఆవాసంగా ఉండేందుకు రెండు రాష్ట్రాలు అనుకూలంగా ఉండగా, ఒకవేళ అది ఇక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకుంటే ఏం చేద్దామనే ఆలోచనలో పడ్డారు.

### ఏనుగు గుంపుతో వస్తే ఎలా..?

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చి ఇద్దరి మరణానికి కారణమైన ఏనుగు, తిరిగి గుంపుతో వచ్చే ప్రమాదముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఏనుగుల గుంపు.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మకాం వేసింది. ఆ మంద నుంచి విడిపోయిన మగ ఏనుగు మన రాష్ట్రంలోకి వచ్చి భయాందోళనలు సృష్టించిన విషయం విదితమే. అది తిరిగి గుంపుతో మన రాష్ట్రంలోకి ప్రవేసిస్తే ఎలా ఎదుర్కోవాలని అటవీ అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల అరణ్య భవన్‌లో సమావేశమై చర్చించారు. ముఖ్యంగా ఏనుగులు రాత్రిపూట ఎక్కువగా సంచరించే అవకాశముండగా, సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకుగాను ఇప్పటికే మంచిర్యాల కలెక్టరేట్‌లో అటవీ శాఖ, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, పశు వైద్య శాఖ అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఏనుగు వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలో రేంజ్ అధికారులు వారికి అవగాహన కల్పిస్తున్నారు.

### ఇప్పటికే ముగ్గురు మృతి

ఏనుగు కారణంగా తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరు, మహారాష్ట్రలో ఒకరు మరణించారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా దట్టమైన అటవీ ప్రాంతం కావడం, ఎక్కువ గ్రామాలు కూడా అడవుల్లోనే ఉండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పలు జాగ్రత్తలు తెలిపారు.

### ఏనుగు వస్తే..

- మీ పరిసరాల్లో ఏనుగు కనిపించిన వెంటనే అటవీశాఖకు సమాచారం అందించాలి.
- ఏనుగు గ్రామాల వైపు వస్తే దుప్పట్లు, చీరలు లేదా ఏదైనా ఇతర వస్త్రాన్ని విసిరి ఏనుగు దృష్టిని మళ్లించాలి. ● ఏనుగుల మంద రోడ్డును దాటేటప్పుడు వేచి ఉండాలి.
- ఏనుగులు ఇప్పపూల వాసనకు ఆకర్షితులవుతాయి కాబట్టి వాటిని నిల్వ చేయడం మంచిది కాదు. ● ఏనుగు పగటిపూట విశ్రాంతి తీసుకుంటుంది. ఆ సమయంలో వాటిని ఇబ్బంది పెట్టడం లేక వాటిని చూడడం మంచిది కాదు.
- ఏనుగు కనిపిస్తే ఇండ్లు, సమీప పాఠశాలల్లో రాత్రి వేళల్లో తలదాచుకోవాలి.

### అప్రమత్తంగా ఉన్నాం



ప్రస్తుతం ఏనుగుల గుంపు పొరుగున ఉన్న మహారాష్ట్రలో ఉన్నందున అప్రమత్తంగా ఉన్నాం. ప్రస్తుతం ఏనుగు ఎక్కడ ఉంది.. ఎటు వెళ్తుంది అనే విషయాన్ని మహారాష్ట్ర అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి తెలుసుకుంటున్నాం. గ్రామాల్లో వలంటీర్లను ఏర్పాటు చేయడంతో పాటు ఏనుగు వస్తే ఏం చేయాలి, ఏం చేయకూడదో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఆర్ రవి, రేంజర్, కోటపల్లి

### చేయకూడనివి..

- అడవి ఏనుగులను చూడటానికి గుంపులు వెళ్లవద్దు. అవి ఒత్తిడికి గురై దాడిచేసే అవకాశముంటుంది. ● ప్రకాశవంతమైన రంగులు ధరించవద్దు. ● రాళ్లు, సీసాలు మొదలైనవి విసిరి ఏనుగును గాయపరచవద్దు. ●ఏనుగు కనిపిస్తే వెంబడించవద్దు. ● ఏనుగు పంట పొలాలను ధ్వంసం చేస్తుంటే ఒంటరిగా దానిని తరిమికొట్టేందుకు యత్నించవద్దు. ● ధాన్యం నిల్వ చేసే ప్రాంతాల దగ్గర నిద్రపోకండి. ● ఉదయం, సాయంత్రం ఏనుగులు చాలా చురుకుగా ఉంటాయి. ఆ సమయంలో చేలల్లో పనిచేయక పోవడం ఉత్తమం

## బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్

భీమారం, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ స్పష్టం చేశారు. భీమారానికి చెందిన సోషల్ మీడియా వారియర్, యువ నాయకుడు దాసరి మణిదీపక్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆదివారం బాల్క సుమన్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, దాంపూర్ మాజీ సర్పంచ్ దాసరి మధునయ్య, బీఆర్ఎస్ నాయకులు పోటు రాజేశ్వర్ రెడ్డి, గుడిమల్ల వెంకటి మేస్త్రీ, దుర్గం లాజర్, రాజారమేశ్, రిక్కుల మధుకర్‌రెడ్డి, వాల శ్రీనివాస్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

### రామకృష్ణాపూర్‌లో..

మందమర్రి, ఏప్రిల్ 28: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పల్లె నర్సింగ్ అత్తమ్మ భీమ శంకరమ్మ ఇటీవల మరణించగా ఆదివారం నెలమాసికం నిర్వహించారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నర్సింగ్ ఇంటికి వెళ్లి శంకరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే 14వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ అధ్యక్షుడు అందె శ్రీకాంత్ తండ్రి ఇటీవల మరణించగా బాల్క సుమన్ పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజరమేశ్, రవీందర్, మేడిపల్లి సంపత్, బడికెల సంపత్ కుమార్ పాల్గొన్నారు.



దాసరి మణిదీపక్‌ను పరామర్శిస్తున్న బాల్క సుమన్

# లిక్కర్ లీడర్..!

- ఆ నేత అండదండలతోనే కాగజ్‌నగర్ డివిజన్‌లో జోరుగా మద్యం దందా
- ఎమ్మార్పీకంటే అధిక ధరలకు విక్రయాలు
- మాట వినకుంటే రైడ్ చేయిస్తాడన్న ఆరోపణలు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు





కాగజ్‌నగర్, ఏప్రిల్ 27 : కాగజ్‌నగర్ డివిజన్‌లోని మద్యం వ్యాపారుల ఆగడాలు రోజు రోజుకూ మితిమీరిపోతున్నాయి. ఓ లిక్కర్ లీడర్ అండదండలతోనే మద్యాన్ని ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైన్స్‌ల నిర్వాహకులంతా సిండికేట్‌గా మారి ధనార్జనే ధ్యేయంగా మద్యాన్ని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నా, సంబంధిత అధికారులు 'మామూలు'గా తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది. మద్యం ప్రియులు ఫిర్యాదు చేసినప్పుడల్లా.. ఏదో తూతూ మంత్రంగా విచారణ చేపట్టడం.. ఆపై వదిలేయడం పరిపాటిగా మారుతున్నదని పలువురు పేర్కొంటున్నారు. సదరు లీడర్ అధికారులకు లంచాలు ఇచ్చి మరీ.. ఈ వ్యవహారమంతా నడిపిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల కాగజ్‌నగర్ డివిజన్‌లోని చింతలమానేపల్లి మండలం గూడెంలోని వైన్స్‌లో అధిక ధరలకు మద్యం విక్రయించడం.. ఆ విషయమై మద్యం ప్రియులు నిర్వాహకులను ప్రశ్నించడం.. ఆ వీడియో వైరల్ అవ్వడం అందరికీ తెలిసిందే. దీనిపై స్పందించిన జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి హుటాహుటిన ఎక్సైజ్ ఎస్ఐని పంపించి విచారణ చేపట్టించారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాల్లో ఒక్కో క్వాటర్, బీరుపై రూ. 20 నుంచి రూ. 30 దాకా అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

### లీడర్ మాట వినకుంటే రైడ్..?

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 15 లైసెన్స్ మద్యం దుకాణాలు, 3 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఓ మద్యం వ్యాపారి లిక్కర్ లీడర్‌గా అవతారమెత్తి ఈ వ్యవహారాన్నంతా తన కనుసన్నల్లో నడిపిస్తున్నట్లు తెలుస్తున్నది. వైన్స్ నిర్వాహకులను మచ్చిక చేసుకొని సిండికేట్ వ్యాపారం చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏదైనా సమస్య వస్తే 'నేను చూసుకుంటా...మీరేం భయపడవద్దు' అని భరోసానిస్తూ అక్రమ దందా సాగిస్తున్నట్లు తెలుస్తుంది. ఏవరైనా మద్యం వ్యాపారి సిండికేట్ వ్యాపారానికి ఒప్పుకోకుంటే అతని ఆగ్రహానికి గురికావాల్సిందేనట. సిండికేట్ వ్యాపారానికి ఒప్పుకోలేదని సదరు వ్యాపారుల దుకాణాలపై కొన్ని నెలల క్రితం రైడ్ జరిపించాడని పట్టణంలో చర్చ జరుగుతున్నది. కాగా, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనల మేరకు మద్యం విక్రయాలు జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.